క్లుప్తంగా

వైఎస్సార్ బీమా సాయం అందజేత



బాధిత కుటుంబానికి రూ. 10 వేలు అందజేస్తున్న మాలిక్ బాషా

గడివేముల: మండల పరిధిలోని కొర్రపోలూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (45) మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య లింగమ్మకు బుధవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను సర్పంచ్ మాలిక్‌బాషా అందజేశారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చిన సర్పంచ్ వైఎస్సార్ బీమా నిరుపేద కుంటుబాలకు అండగా నిలుస్తుందన్నారు. మిగిన బీమా సొమ్ము త్వరలో బాధితురాలి బ్యాంక్ అకౌంట్లో జమ అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఐశ్వర్య, వలంటీరు తదితరులు పాల్గొన్నారు.

కేసీ కాల్వకు 159 క్యూసెక్కులు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు బుధవారం డ్యామ్ అధికారులు పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో 0.581 టీఎంసీల నిల్వ ఉందని, ఇన్ ఫ్లో నిలిచిపోందని వారు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు

సి.బెళగల్: గ్రామాల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శుల (పీఎస్‌ల)తో బుధవారం అభివృద్ధి కార్యాక్రమాలపై నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పీఎస్‌లు విధులకు రెగ్యులర్‌గా హాజరవ్వాలని, గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనుల నిర్మాణాను వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. గ్రామ సచివాలయ ఇంజినీర్ ఉద్యోగులను, కాంట్రాక్టర్లతో చర్చిస్తూ, ఎప్పటికప్పుడు పురోగతిని మండల అధికారుల దృష్టికి తీసుకరావాలని సూచించారు.

నేడు పులకుర్తిలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును గురువారం మండలంలోని పులకుర్తి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, ప్రజలంతా హెల్త్ క్యాంపులో పాల్గొని ఆరోగ్య సేవలను పొందాలని ఎంపీడీఓ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. బుధవారం రాత్రి నంద్యాల పట్టణానికి చెందిన గోవిందురాజు కోడుమూరు నుంచి బైక్‌పై వస్తున్నాడు. సుగాలిమెట్ట వద్ద అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొట్టడంతో గోవిందురాజుకు గాయాలయ్యాయి. అతన్ని హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



గెలుపొందిన జట్టు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దసరా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. మొదటి స్థానంలో పాణ్యం టీం ప్రతిభ చాటి రూ. 40 వేలు కైవసం చేసుకోగా రెండో బహుమతి రూ.30 వేలను నంద్యాల టీం గెలుచుకుంది. మూడో బహుమతి రూ.10 వేలను ఆత్మకూరు టీం కైవసం చేసుకుంది. విజేతలకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కరుణాకర్ రెడ్డి, నాయకులు బాబు, రాజన్న, ఎల్లా గౌడ్ తదితరులు బహుమతులను అందించారు.

ఆరోగ్య సురక్ష ప్రజారోగ్యానికి రక్ష

- పేదలకు సైతం మెరుగైన వైద్యం
- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



కల్లపరి హెల్త్ క్యాంపులో వృద్ధురాలికి అద్దాలు పెడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



హెల్త్ క్యాంప్‌లో వ్యక్తికి కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజారోగ్యానికి రక్షణగా నిలుస్తుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంతో ఉన్న ఊళ్లోనే పేదలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మండలంలోని కల్లపరి గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ సందర్శించారు. క్యాంపులో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై డాక్టర్లతో చర్చించారు. అదేవిధంగా స్వయంగా ప్రజలను అడిగి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ ఇంటి వద్దకే నాణ్యమైన వైద్య సేవలందుతున్నాయన్నారు. కల్లపరిలో జరిగిన హెల్త్ క్యాంపుకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. క్యాంపులో దాదాపు 330మందికి పైగా వైద్య సేవలు పొందారు.

ప్రజల సొమ్మును దోచుకున్న చంద్రబాబు

ప్రజల సొమ్మును దోచుకున్నందుకే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని సీఐడీ అధికారులు జైలులో పెట్టారని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. బాబు మోసాలను ప్రజలంతా తెలుసుకున్నారని, చంద్రబాబు తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే నానాతంటాలు పడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలంతా తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సర్పంచ్‌లు రంగమ్మ, బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, స్థానిక నాయకులు పురంధర్‌రెడ్డి, గుంటన్న, ఇమ్మానేయులు, వెంకటేష్, జీవన్, అద్దుగల రాజశేఖర్‌రెడ్డి, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష... దేశానికే ఆదర్శం

కర్నూలు సిటీ: గ్రామీణ ప్రాంతాల్లో పేదలందరు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శగా కానుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ పేర్కొన్నారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఏ రోజు పేదల ఆరోగ్యం గురించి పట్టించుకోలేదని విమర్శించారు. బుధవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని గొందిపర్లలో సర్పంచ్ శ్రీనివాసులు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహించారు. క్యాంప్‌ను సందర్శించిన ఎమ్మెల్యే ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రజారోగ్య సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిని పెంచడంతోపాటు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని తీసుకొచ్చి ప్రజల వద్దకే వైద్య సేవలు అందజేస్తున్నారని గుర్తు చేశారు. వైద్య నిపుణులు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేయడంతోపాటు మందులు అందజేస్తున్నారని, ప్రజలు హెల్త్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, ఎంపీడీఓ అజాంఖాన్, ఈఓఆర్డీ అనురాధ, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధయ్య, వెంకట్, బీసీ మద్దిలేటి, బి.రాజు, వెంకట్రాముడు, లక్ష్మణ్‌గౌడ్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వాసు, ఉల్చాల సర్పంచ్ విద్యా సాగర్, వీఆర్ఓ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బాబు

ప్రజా సంక్షేమాన్ని మాజీ సీఎం చంద్రబాబు విస్మరించారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ విమర్శించారు. ఎన్నికల సమయంలో మాత్రం ప్రజలు గుర్తుకొస్తారని, అప్పుడు మాత్రం ఎనలేని ప్రేమ ఒలకబోస్తారని ధ్వజమెత్తారు. ఎన్నికల వచ్చాయంటే ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలి? ఎవరిని మభ్యపెట్టాలని అనే కుట్రలు పన్నడం తప్పా ప్రజలకు ఏదైనా మేలు చేయాలనే తలంపు ఎప్పుడూ ఉండదని ఆరోపించారు. బాబుకు మద్దతుగా సినీ నటుడు పార్టీ పెట్టుకుని కులాన్ని, అభిమానులను రెచ్చగొట్టే వ్యాఖ్యాలు మినహా ప్రజలకు చేసిన మేలు ఏదీ లేదన్నారు. ప్రజలకు జరుగుతున్న మేలును ఓర్వలేక అసత్యారోపణలకు పాల్పడుతున్న టీడీపీ, జనసేనకు గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్యే ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని కోరారు.

పేదల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

గడివేముల: పేదల రోగ్య పరిరక్షణే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎంపీపీ నాగమద్దమ్మ, సర్పంచ్ కత్తి తులషమ్మ, ఉప సర్పంచ్ శివానందరెడ్డిలు పేర్కొన్నారు. మండల పరిధిలోని గని సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును బుధవారం వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. వైద్యనిపుణులు ప్రజలకు బీపీ, షుగర్, మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు ఉచితంగా మందులు అందజేశారు. 891 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరిగిందని తలముడిపి పీహెచ్‌సీ డాక్టర్ చిన్న మద్దిలేటి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, పంచాయతీ కార్యదర్శి రాజేష్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయలక్ష్మి, సచివాలయ, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమద్దమ్మ

తైక్వాండో పోటీలలో విద్యార్థినికి కాంస్య పతకం



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: అంతరాష్ట్ర ఇన్విటేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలలో హుసేనాపురం విద్యార్థినికి కాంస్య పతకం లభించినట్లు మాస్టర్ బాబురావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21, 22 వ తేదీలలో తిరుపతిలో రెండు రోజుల పాటు జరిగిన అంతరాష్ట్రాల ఇన్విటేషనల్ పోటీలలో మండలంలోని హుసేనాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని దివ్యశ్రీ అండర్-22 కిలోల విభాగంలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ విభాగంలో ప్రతిభ కనపరచిన దివ్యశ్రీ కాంస్య పతకం దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఏపీ అమెచ్యూర్ తైక్వాండో కార్యదర్శి గ్రాండ్ మాస్టర్ బాబురావు, అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బి.వెంకటేశ్వర్లు విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో కోచ్ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్బీకే భవనం ప్రారంభం

ఓర్వకల్లు: మండలంలోని కొమరోలు గ్రామంలో గురువారం నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, పాల కేంద్రం యూనిట్‌ను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని సూచించారు.

వైద్య రంగానికి ప్రాధాన్యత



విలేజ్ క్లినిక్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్, ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్

కర్నూలు సిటీ: వైద్యరంగానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని, మారుమూల గ్రామాల ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ తెలిపారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని పూలతోట గ్రామంలో బుధవారం డా.వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌ను ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా రూ.20.80 లక్షలతో నిర్మించిన భవనంలోని డాక్టర్ ఛాంబర్, ఏఎన్ఎం, ఫార్మాసిస్టు గదులను పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విలేజ్ క్లినిక్‌లో దాదాపు అన్ని వైద్య సేవలు అందుతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, గూడురు, సి.బెళగల్ జెడ్పీటీసీలు మౌలాలి, గిరిజోన్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వాసు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మహబూబ్ బాషా, ఉల్చాల సర్పంచ్ సాగర్, స్థానిక నాయకులు రాజశేఖర్ రెడ్డి, మద్దిలేటి, సూర్యచంద్రారెడ్డి, రాజశేఖర్, సుధాకర్, గౌస్, బీసీ మద్దిలేటి, తిమ్మప్ప, లక్ష్మణ్‌గౌడ్, మల్లెపూల రాజు, నారాయణరెడ్డి, ఎంపీడీఓ అజాంఖాన్, ఈఓఆర్డీ అనురాధ, డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

కర్నూలు (సిటీ): సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్ అధికారులకు సూచించారు. బుధవారం స్టాంటన్ పురంలోని క్యాంపు కార్యాలయంలో కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల అధికారులతో సమీక్షించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలపై చర్చించారు. ఇప్పటి వరకు గుర్తించిన సమస్యలతో ఎన్ని పరిష్కారమయ్యాయని, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని ఎంపీడీఓలను అడిగి తెలుసుకున్నారు.

ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరణ

కల్లూరులోని రావూరి గార్డెన్‌లో నవంబర్ 3, 4, 5 తేదీల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రాన్స్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే స్వగృహంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్, జిల్లా మత్స్య శాఖ జేడీ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి దుర్గమ్మ

- కనుల పండువగా దుర్గా మాత విగ్రహాల శోభాయాత్ర
- ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా మహిళల కలశ యాత్ర
- తుంగా తీరంలో శోభాయమానంగా దుర్గామాత నిమజ్జనోత్సవం



దుర్గా మాతకు పూజలు నిర్వహిస్తున్న మేయర్ బీవై రామయ్య, చిత్రంలో మాజీ ఎంపీ టీజీ వెంకటేష్



అమ్మవారి నిమజ్జనానికి తరలివచ్చిన భక్తులు

కర్నూలు(సెంట్రల్): దసరా శరన్నవరాత్రుల్లో పూజలు అందుకున్న దుర్గా మాత విగ్రహాల నిమజ్జనోత్సవ వేడుక శోభాయమానంగా జరిగింది. తుంగభద్రా నది ఒడ్డున ఉన్న సంకల్ బాగ్‌లో దుర్గమ్మలు గంగమ్మలో కలిసిపోయారు. బుధవారం దుర్గాఘాట్‌లో గీతా ప్రచార సమితి, దుర్గా మాత విగ్రహాల నిమజ్జనోత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగర మేయర్ బీవై రామయ్య, రాజ్యసభ మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి, కర్నూలు డీఎస్పీ విజయశంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి గంగమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం పరాశక్తి బృందం దుర్గా మాత విగ్రహానికి పూజలు నిర్వహించి నిమజ్జనాన్ని ప్రారంభించారు. అంతకు ముందు నగరంలోని వివిధ ప్రాంతాల్లో కొలువు దీరిన దుర్గా విగ్రహాల శోభాయాత్ర వైభవంగా సాగింది. మహిళలు అధిక సంఖ్యలో బోనాలతో ఊరేగింపులో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కోలాటాలు, భజనలతో నగరంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. తుంగభద్రా నదితో పాటు, కేసీ కెనాల్ వినాయ ఘాట్‌లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో టీజీ భరత్, బీవీ రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, చిన్మయ మిషన్ అమ్మవారు సుప్రేందనంద, కేజే రెడ్డి గీత ప్రచార సంఘం అధ్యక్షులు రమణయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్పొరేట్ కృష్ణకాంత్, దుర్గా ఉత్సవ సమితి ప్రతినిధులు ఎలమర్తి రమణయ్య, విఠల్‌శెట్టి, మహాబలేష్, హనుమంతరావు, దాశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొర్రపోలూరులో గడప గడపకు మనప్రభుత్వం

గడివేముల: మండల పరిధిలోని కొర్రపోలూరు గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మధ్యాహ్నం 3 గంటల నుంచి గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి సమస్యలతో పాటు, ప్రభుత్వం అందించిన సంక్షేమపథకాలు అందుతున్న తీరును అడిగి తెలుకుంటారన్నారు. మండలస్థాయి అధికారులు,సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఇంటి వద్దకే ఆర్టీసీ కార్గో సేవలు

- కొరియర్, పార్సిల్స్ డోర్ డెలివరీపై ప్రత్యేక దృష్టి
- గత ఏడాది 2021 సెప్టెంబర్ 1 నుంచే అమల్లోకి
- ఏజెన్సీ మారడంతో కొంత కాలం బ్రేక్
- విస్తృత ప్రచారం కోసం నేటి నుంచి మాసోత్సవాలు

సరుకు రవాణాలో అడుగు పెట్టిన రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులు, వ్యాపారుల సరుకులు, పార్సిళ్ల సరఫరాపై దృష్టి పెట్టింది. కొరియర్స్‌ను ప్రజల ఇంటి వద్దకే చేర్చేందుకు ప్రత్యేక దృష్టి పెట్టంది. రెండేళ్ల క్రితం ప్రవేశపెట్టిన డోర్ డెలివరీ సేవలను మరింత విస్తృతం చేస్తోంది. గతంలో ఒక పట్టణం నుంచి మరో పట్టణంలోని ఆర్టీసీ పార్సిల్ కేంద్రాలకు మాత్రమే సేవలు ఉండగా వినియెగదారులు తమకు వీలున్నప్పుడు బస్‌స్టేషన్‌లకు వెళ్లి పార్సిల్‌ను తెచ్చుకునేవారు. ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో 2021 సెప్టెంబరు 1వ తేదీ నుంచి డోర్ డెలివరీ సేవలు అందుబాటులోకి తెచ్చింది. బుకింగ్ సమయంలో డోర్ డెలివరీ అని ఆప్షన్ ఇస్తే సిబ్బంది సంబంధిత అడ్రస్‌కే కొరియర్‌ను అందిస్తున్నారు.



కంప్యూటర్‌లో పార్సిల్ కార్యాలయం

కర్నూలు(రాజ్‌విహార్): కేవలం ప్రజా రవాణాకే ప్రాధాన్యత ఇచ్చిన ఆర్టీసీ 2016 కంటే ముందు లగేజీ, పార్సిల్స్‌ను ఏఎస్ఎల్ సంస్థ అనుంబధంగా సేవలందించింది. 2016 జూన్ 3 నుంచి స్వయంగా కార్గో సేవలను ప్రారంభించి, ఏఎస్ఎల్‌తో ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. పూర్తి స్థాయి సేవలపై దృష్టి పెట్టి,క్రమంగా డోర్ డెలివరీ విధానం తెచ్చి, ప్రైవేటు కొరియర్ సర్వీసులకు ధీటుగా సేవలందించేందుకు శ్రీకారం చుట్టింది. ఏజెన్సీ మారడంతో కొంత కాలం బ్రేక్ పడినా తిరిగి ఇటీవలే ప్రారంభించింది.

ఏడు పట్టణాల్లో సేవలు

డోర్ డెలివరీ సేవలను ప్రారంభించిన ఆర్టీసీ తొలుత రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లా కేంద్రాలతో పాటు రాజమండ్రి, తిరుపతి, విజయవాడ నగరాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. డోర్ డెలివరీ కోసం అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా డెలివరీ బాయ్స్‌ను నియమించుకున్నారు. ప్రస్తుతం కర్నూలుతో పాటు ఆదోని, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, డోన్, నంద్యాల, ఎమ్మిగనూరు పట్టణాల్లో సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల నూతన లేజెన్సీకి బాధ్యతలు అప్పగించడంతో డెలివరీ బాయ్స్ సంఖ్యను పెంచుకొని సేవలను వ్యాపింపజేయాలనే ఆలోచనలో ఉంది.

50 కేజీల్లోపు.. 10కిలో మీటర్ల లోపు

ఇంటి వద్దకే కొరియర్ సేవలందిస్తున్న ఆర్టీసీ ముందుగా 10 కేజీల్లోపు ఉన్న ఆర్టికల్స్‌కు మాత్రమే అందించారు. కొత్త బస్టాండ్ నుంచి 10 కిలో మీటర్ల లోపు కవర్లు, పార్సిళ్లు, బాక్సులు, సంచులు (బస్తా), పాకెట్లను బుకింగ్ చేసే సమయంలో 'డోర్ డెలివరీ' అని ప్రస్తావిస్తే ఇల్లు, కార్యాలయం, షాపులు, వ్యాపార సంస్థల వద్దకే వెళ్లి అందించారు. డెలివరీ సమయంలో యజమాని సెల్ నంబర్, సంతకం, ఫొటో తీసుకుని అప్పగిస్తూ వస్తున్నారు. గత ఏడాది నుంచి పార్సిల్స్ బరువు 10 కేజీల నుంచి 50కి పెంచి సేవలందిస్తున్నారు.

నేటి నుంచి మాసోత్సవాలు

ప్రస్తుతం పార్సిల్ కేంద్రాల నుంచి కర్నూలు జిల్లాలో (రీజియన్) రోజుకు 1,500 వరకు వరకు బుకింగ్స్ ఉండడంతో రూ.1.30 లక్షల వరకు ఆదాయం వస్తోంది. సొంత బస్సుల్లో సరుకు రవాణా చేస్తున్నందున్న రవాణా ఖర్చు లేదు. నెలకు సుమారు రూ.40 లక్షల ఆదాయం వస్తోంది. డోర్ డెలివరీ ద్వారా నెలకు రూ.1.50 లక్షల వరకు వస్తుందని అంచనా. ఇటు బాయ్స్‌ను తీసుకుంటే యువతకు ఉపాధి అవకాశాలూ వరించనున్నాయి. దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు గురువారం నుంచి నవంబరు 25వ వరకు డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రయాణికులు, వ్యాపారులు, వాణిజ్య సంస్థల ప్రతినిధులను సంప్రదించి తమ సేవలను వివరించనుంది.

చార్జీలు ఇలా..

డోర్ డెలివరీ కోసం అదనంగా చార్జీలు వసూలు చేయనున్నారు. ఒక కేజీలోపు బరువు ఉంటే రూ.18, ఆరు కేజీలలోపు ఉంటే రూ.30, పది కేజీల లోపు ఉంటే రూ.36, ఇరవై ఐదు కేజీల వరకు రూ.48, యాభై కేజీల వరకు రూ.59 చొప్పున వసూలు చేస్తున్నారు.

ప్రైవేటు కంటే మెరుగ్గా సేవలు



కొరియర్, పార్సిల్స్ రంగంలో ప్రైవేటు సంస్థల కంటే మెరుగ్గా డోర్ డెలివరీ సేవలందించేందుకు చర్యలు చేపట్టాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 50 కేజీల లోపు బరువు పార్సిల్స్‌ను ఆయా అడ్రస్‌కు తీసుకెళ్లి ఇస్తున్నాం. ఆ తరువాత క్రమంగా పట్టణాలకు విస్తరింపజేస్తాం.

– కేవీ రమణ, డీసీటీఎం, కర్నూలు

పాఠశాల పరిసరాల పరిశీలన

సి.బెళగల్: మండల పరిధిలోని గొల్లలదొడ్డి ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలోని బంక్‌లో బీడీలు, సిగరెట్‌లు అమ్ముతున్నట్లు విద్యార్థులు, గ్రామస్తులు ఫిర్యాదులు మేరకు బుధవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు అధికారులతో కలిసి స్కూల్ పరిసరాలను పరిశీలించారు. బంక్ యజమానితో మాట్లాడి హెచ్చరించారు. పాఠశాలలు, విద్యార్థుల పరిరక్షణకు గ్రామస్తులు సహకరించాలని ఈ సందర్భంగా ఎంపీడీఓ కోరారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సందీప్, ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాషా, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, వీఆర్వో లింగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తడకనపల్లెలో ఉరుసు

కల్లూరు: మండల పరిధిలోని తడకపల్లె గ్రామంలో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు హజరత్ శ్రీ శ్రీ మహబూబ్ సుభాని, దస్తగిరి స్వామి ఉరుసు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు గ్రామ పెద్దలు తెలిపారు. 26న తేదీన గురువారం ఉదయం ఖవాలీ, రాత్రి గంధం, 27వ తేదీన ఉదయం కొలన్న ఆటలు, సాయంత్రం కిస్తీలు ఉంటాయన్నారు. అలాగే అన్నదాన కార్యక్రమం ఉంటుందని గ్రామ పెద్దలు తెలిపారు. 28న జియారత్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పాణ్యంలో చోరీ

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని షాదీఖానా వద్ద ఉన్న ఓ ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్ఐ అశోక్ బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన మంగమ్మబాయి ఉదయం ఇంటికి తాళం వేసి పనికి వెళ్లింది. సాయంత్రం వచ్చి చూడగా ఇంటి గొళ్లెం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.50వేలు, 10తులాల వెండి వస్తువులు దొంగిలించినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు.